ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు


TAMILNADU

ఆదివారం 8 డిసెంబరు 2024




200 కాదు...

# 234 స్థానాల్లో గెలుస్తాం



## స్టాలిన్‌ను మళ్లీ సీఎం చేస్తాం

● విజయ్ మహా మేధావి అనుకుంటున్నారు ● మంత్రి శేఖర్‌బాబు ధ్వజం

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి 234 స్థానాలు కైవసం చేసుకుని మళ్లీ అధికారంలోకి వస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు అన్నారు. చెన్నైలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న టీవీకే అధ్యక్షుడు, సినీ హీరో విజయ్ డీఎంకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన విషయం విదితమే. వీటిని మంత్రి శేఖర్ బాబు శనివారం తిప్పికొట్టారు. ఇదే విషయంపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళా సంక్షేమం, భద్రతకు ముఖ్యమంత్రి స్టాలిన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. కానీ, రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందంటూ అసత్య ప్రచారం చేస్తే ముఠా ఉందన్నారు. మహిళలకు వ్యతిరేకంగా ఏ చిన్న అన్యాయం జరిగినా, వేధింపులకు పాల్పడినా అలాంటి వారిని తక్షణం గుర్తించి అరెస్టు చేయడంతో సరిపెట్టుకోకుండా శిక్షపడేలా డీఎంకే పాలన సాగుతోందన్నారు. అయితే, రాష్ట్ర రాజకీయాలపై ఏమాత్రం అవగాహన లేని కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తప్పు చేసే వారు ఏస్థాయిలో ఉన్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలతో లబ్ధి పొందుతున్న ఓటర్లను నమ్మి ఈ వ్యాఖ్యలు చేయడం లేదనీ, రాష్ట్రంలోని ప్రతి వర్గానికి చెందిన ప్రజలు మళ్లీ డీఎంకే ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 200 సీట్లను గెలుస్తామని తాము అంటుంటే... డీఎంకే ఆశలు గల్లంతు అవుతాయని ఓ వ్యక్తి మహా మేధావిలా అనుకుంటూ, రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని పరోక్షంగా విజయ్‌పై విమర్శలు గుప్పించారు.

### 200 స్థానాల్లో విజయం తథ్యం: కనిమొళి

ఐసిఎఫ్: రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆ పార్టీ ఎంపీ కనిమొళి ధీమా వ్యక్తం చేశారు. తిరుచెందూర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కనిమొళి మాట్లాడుతూ... పార్టీని గెలిపించే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేసి వారి ఆదరణ పొందాలన్నారు. క్రమశిక్షణతో పనిచేస్తే విజయం తథ్యమన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని, రాబోయే ఎన్నికల్లో ఈ విషయం నిరూపితమవుతుందన్నారు.

## రేపటి నుంచి 125 సబర్బన్ రైళ్ల రద్దు

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ట్రాక్ మరమ్మతులు, ఇంజనీరింగ్ పనుల కారణంగా ఈనెల 9వ తేదీ నుంచి 125 సబర్బన్ రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే శనివారం పేర్కొంది. చెన్నై బీచ్ - తాంబరం మధ్య ప్రతిరోజూ 200 సబర్బన్ రైలు సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, ట్రాక్ మరమ్మతులు, ఇంజనీరింగ్ పనుల కారణంగా వచ్చే సోమవారం నుంచి ఆదివారం రైల్వే టైంటేబుల్ ప్రకారం సర్వీసులు నడుస్తాయని దక్షిణ రైల్వే వెల్లడించింది. దీంతో బీచ్ - తాంబరం ప్రాంతాల మధ్య 125 సబర్బన్ రైలు సర్వీసులు రద్దు కానున్నాయి. ఈ రైలు సర్వీసుల రద్దుతో ఈ మార్గంలో అదనపు సిటీ బస్సులను నడిపేలా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

# సారీ...

విజయ్ వ్యాఖ్యలపై ఉదయనిధి రియాక్షన్

## నేను సినిమా వార్తలు చూడటం లేదు!

వేలూరు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): 'సారీ... నేను సినిమా వార్తలు చూడడంలేదు' అంటూ విజయ్ వ్యాఖ్యలకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ బదులిచ్చారు. వేలూరు, రాణిపేట జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శుక్ర, శనివారాల్లో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన అంబేడ్కర్ గ్రంథావిష్కరణలో డీపీఐ నేత ఆదవ్ అర్జునా, టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ వ్యాఖ్యలపై విలేకరులు పలు ప్రశ్నలడిగారు. వీటిపై ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి బదులిస్తూ... పుట్టుకతోనే ఎవరూ ముఖ్యమంత్రి కాలేరు, అందుకు తమ ప్రతినిధులను ప్రజలే ఎన్నుకుంటున్నారు. ఇలాంటి కనీస జ్ఞానం లేకుండా కొందరు మాట్లాడుతున్నారంటూ బదులిచ్చారు. కాగా, శుక్రవారం రాత్రి నగరంలో జరిగిన అంబేడ్కర్ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో డీపీఐ నేత ఆదవ్ అర్జునా మాట్లాడుతూ... పుట్టుకతో ఎవరూ ముఖ్యమంత్రి కారాదని అన్నారు. అలాగే, కూటమి పార్టీల బలంతో 200 స్థానాలు గెలవాలనుకుంటున్నామని, రాబోయే 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో కూటమి పార్టీల లెక్కలు తారుమారవుతాయని విజయ్ పేర్కొన్నారు.

### రూ.128 కోట్ల విలువైన సహాయాలు...

జిల్లా క్రీడా మైదానంలో కలైంజర్ స్పోర్ట్స్ కిట్లు, పలు శాఖల ఆధ్వర్యంలో రూ.128 కోట్ల సహాయాలను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శనివారం అందజేశారు. 247 పంచాయతీలకు క్రీడా ఉపకరణాలు, 4,844 మంది లబ్ధిదారులకు రూ.128 కోట్ల విలువైన సహాయాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ... క్రీడా రంగంలో దేశంలోనే చెన్నై ముందంజలో ఉందన్నారు. నగరాల్లో లభించే క్రీడా వసతులు గ్రామాల్లో కూడా కల్పిస్తున్నామని, దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశముంటుందని తెలిపారు. ప్రజల కోర్కెలు నెరవేర్చి, వారి ఆదరాభిమానాలతో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజా పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మంత్రి దురైమురుగన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీలు జగద్రక్షకన్, కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అములు విజయన్, ఈశ్వరప్పన్, విల్వనాధన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విధి నిర్వహణలో ఉత్తమంగా పనిచేస్తున్న వేలూరు తహసీల్దార్ మురళీధరన్, తిరువలమ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సంక్షేమ అధికారి రాణి, ఆసనాంపట్టు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు శరవణన్‌కు ఉప ముఖ్యమంత్రి షీల్డు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



వేలూరు తహసీల్దార్ మురళీధరన్‌కు షీల్డు బహూకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

## ప్రజా భవన్‌గా రాజ్‌భవన్

● గవర్నర్ రవి



ఫ్లాగ్‌డే నిధికి రూ.5 లక్షల విరాళం అందజేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, డిసెంబర్ 7, (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని రాజ్‌భవన్‌ను ప్రజా భవన్‌గా తీర్చిదిద్దినట్టు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. న్యాయకోవిదుడు డాక్టర్ అంబేడ్కర్ తన మేధో శక్తితో భారతదేశానికే కాకుండా ప్రపంచ స్థాయిలో చట్టాలను రూపొందించి ప్రశంసలందుకున్న నేత అని కొనియాడారు. వీఐపీలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు మాత్రమే ప్రవేశించే రాజ్‌భవన్‌లోకి తాను గవర్నర్ పదవి చేపట్టినప్పట్నుంచి సామాన్య ప్రజలు కూడా వచ్చేలా అవకాశం కల్పించానన్నారు. తద్వారా ప్రజా భవన్‌గా మార్చానని తెలిపారు. ఇదిలా వుండగా 'ఫ్లాగ్ డే' నిధి కోసం గవర్నర్ ఆర్ఎన్ రవి శనివారం రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రజా పనుల కార్యదర్శి రీతా హరీష్ ఠక్కర్, గవర్నర్ కార్యదర్శి ఆర్. కిర్లోష్ కుమార్, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

## ముల్లై డ్యాం మరమ్మతుల్లో అలసత్వమా?

ఈపీఎస్ ప్రశ్న

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముల్లై పెరియార్ డ్యాం మరమ్మతు లను చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంపై మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మదురై, తేని, దిండిగల్, శివగంగై, రామనాథపురం జిల్లాలతో పాటు మరికొన్ని జిల్లాల ప్రజలు, రైతులకు తాగు, సాగునీటి అవసరాలను తీర్చే ఈ ముల్లై పెరియార్ డ్యాంకు యేటా మరమ్మతులు చేయడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. అయితే, ఈ యేడాది ఈ పనులు చేపట్టేందుకు వీలుగా, నిర్మాణ సామాగ్రిని డ్యాం వద్దకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అనుమతి తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. ముల్లై పెరియార్ డ్యాం మరమ్మతులు, నిర్వహణ చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విచారించదగిన విషయమని ఆయన పేర్కొన్నారు.

# నేరాలకు ఫుల్‌స్టాప్

పోలీస్ శాఖకు సీఎం ఆదేశం ● శాంతిభద్రతలపై సమీక్ష



సీఎంతో పోలీసు ఉన్నతాధికారులు

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో డీజీపీ శంకర్ జీవాల్, అదనపు డీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదం, చెన్నై నగర పోలీస్ కమిషనర్ అరుణ్ సహా ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. చెన్నై, కోవై, మదురై వంటి ప్రధాన నగరాలతో పాటు రాష్ట్రంలో శాంతిభద్రతలను పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు. అలాగే, రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఏమాత్రం విఘాతం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హత్యలు, మానభంగాలు, సైబర్ నేరాలు, దాడులు, దౌర్జన్యాలకు తావు లేకుండా చూడాలని, పోలీస్ శాఖ తీసుకునే చర్యలే ప్రజలకు రక్షగా నిలుస్తాయని ఈ సందర్భంగా సీఎం అన్నారు.

### రూ.42 కోట్లతో ముడిచ్చూరులో ఆమ్నీ బస్టాండు

చెన్నై నగర శివారు ప్రాంతమైన ముడిచ్చూరులో ప్రైవేటు బస్సు(ఆమ్నీ)ల కోసం నిర్మించిన బస్ టెర్మినల్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ప్రారంభించారు. ఈ బస్టాండును రూ.42.70 కోట్లతో ఒకే సమయంలో 150 బస్సులు నిలిపేలా ఐదెకరాల్లో నిర్మించారు. ఈ బస్టాండును సీఎం స్టాలిన్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. నగర శివారు ప్రాంతమైన కీలంబాక్కంలో ప్రభుత్వం రూ.15 కోట్లతో 16 ఎకరాల్లో మఫిషల్ బస్టాండును నిర్మించి జనవరిలో ప్రారంభించిన విషయం తెల్సిందే. ఇక్కడ కేవలం ప్రభుత్వ బస్సులు మాత్రమే ఆగి వెళుతున్నాయి. దీంతో ప్రైవేటు బస్సుల కోసం 5 ఎకరాల్లో సకల సదుపాయాలతో ముడిచ్చూరులో ఆమ్నీ బస్సుల కోసం బస్టాండును నిర్మించారు. అలాగే, కీలంబాక్కంలోని కలైంజర్ శతజయంతి బస్టాండులో కోట్లాది రూపాయలతో చేపట్టిన వివిధ రకాలైన అభివృద్ధి పనులను కూడా ఆయన ప్రారంభించారు. అదేవిధంగా స్థానిక కోయంబేడు హోల్ సేల్ మార్కెట్‌లో రూ.కోటితో ఆధునీకీకరించిన వైద్య చికిత్సా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఇక్కడ రోడుల కౌన్సెలింగ్ రూం, నర్సులు ఉండేందుకు ప్రత్యేక గది, మూడు పడకల కలిగిన అత్యవసర వైద్య సేవల వార్డు, 24 గంటల పాటు పనిచేసే లాబొరేటరీ, చికిత్స చేయించుకునేందుకు వచ్చే రోగుల్లో 50 మంది కూర్చొనే విధంగా వెయిటింగ్ హాల్ వంటి సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అన్బరసన్, పీకే శేఖర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, ఈ నిర్మాణ పనులన్నీ చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పూర్తి చేసింది.

## వరద బాధిత జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన

విల్లుపురంలో పూర్తి ● నేడు కడలూరులో



విల్లుపురంలో గోడౌన్‌ను పరిశీలిస్తున్న కేంద్రబృందం

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా అపారనష్టం సంభవించిన వరద బాధిత జిల్లాల్లో కేంద్ర బృందం శనివారం పర్యటించింది. ఈ ప్రాంతాల్లో పర్యటించి, వరద నష్టాన్ని అంచనా వేసేందుకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం సహాయ కార్యదర్శి రాజేష్ గుప్తా సారథ్యంలో ఏడుగురు ఉన్నతాధికారుల బృందం చెన్నైకి శుక్రవారమే చేరుకున్న విషయం తెల్సిందే. ఈ బృందం శనివారం విల్లుపురం జిల్లాకు వెళ్లింది. అక్కడ కలెక్టరేట్‌లో వరద నష్టంపై అధికారులతో బృంద సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఫెంగల్ తుఫాను సృష్టించిన బీభత్సం కారణంగా ఏర్పడిన నష్టంపై జిల్లా అధికారులు నివేదికను అందజేశారు. అలాగే, కలెక్టర్ కూడా జిల్లాలో జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. జిల్లాలో విక్రవాండి ప్రాంతం ఈ తుఫాను కారణంగా తీవ్రంగా దెబ్బతినింది. ఈ ప్రాంతానికి కేంద్ర బృందం స్వయంగా పరిశీలించింది. తమ పర్యటనలో తొలి రోజున విల్లుపురం జిల్లాలో కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకుంది. రెండో రోజైన ఆదివారం మరో వరద బాధిత జిల్లా అయిన కడలూరులో పర్యటించనుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కడలూరు జిల్లాలోని వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి, మధ్యాహ్నంపైగా పుదుచ్చేరికి వెళ్తుంది. ఈ రాష్ట్రంలో వరద బాధిత ప్రాంతాల్లో ఈ బృందం పర్యటించిన నష్టాన్ని అంచనా వేయనుంది. ఇప్పటికే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి వరద సాయంగా తక్షణం రూ.614 కోట్లను ఇవ్వాలంటూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో పుదుచ్చేరిలో పర్యటించే ఈ బృందం... పుదువై కాలాపట్టు, తేంగాయ్ తిట్టు హార్బర్, బాహూర్ సహా నాలుగు తుఫాను బాధిత ప్రాంతాల్లో పర్యటించిన నష్టం అంచనా వేయనుంది. కాగా, కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు అన్ని ఏర్పాట్లు చేశారు.

## సమాచార దృష్టి

### ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు అవకాశం

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్త వైద్యకళాశాల ప్రారంభం, యూజీ వైద్యకోర్సుల సీట్లు పెంపునకు దరఖాస్తు చేసుకొనే గడువు జనవరి 4వ తేది వరకు పొడిగించినట్లు జాతీయ వైద్య కౌన్సిల్ పేర్కొంది. రాబోయే 2025-26 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పెంపు, కొత్త వైద్య కళాశాలల ప్రారంభానికి దరఖాస్తు స్వీకరణ ఈ నెల 6వ తేది గురువారంతో ముగిసిన నేపథ్యంలో, జనవరి 4వ తేది వరకు పొడిగించినట్లు కౌన్సిల్ పేర్కొంది. అనుబంధ కళాశాల అంగీకారం సర్టిఫికెట్, ఆస్పత్రి వివరాలు, కళాశాలల భవనాలు తదితర వివరాలతో దరఖాస్తు సమర్పించాలని జాతీయ వైద్య కౌన్సిల్ తెలిపింది.

### రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి పరీక్షలు

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి పరిశోధనలు చేపట్టి నివేదిక అందజేయాలని తాగునీటి బోర్డు అధికారులకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. స్థానిక పల్లావరంలో కలుషిత నీరు తాగి 57 మంది అస్వస్థతకు గురికాగా, వారిలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో, ఆ ప్రాంతంలోని తాగునీటి నమూనాలు సేకరించి గిండిలోని కింగ్స్ ఇనిస్టిట్యూట్‌కు పరీక్షలకు పంపారు. సాధారణంగా ప్రజలకు అందజేసే తాగునీరు క్లోరినేషన్ చేసి, శుద్ధీకరించిన అనంతరం సరఫరా చేస్తుంటారు. తాగునీటి పైపుల లీకేజీ కారణంగా మురుగు కలిసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి పరీక్షలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిరోజూ 10 నివాస ప్రాంతాలకు వెళ్లి, అక్కడ సరఫరా చేస్తున్న తాగునీరు సేకరించి, పరీక్షలకు పంపి నివేదిక అందజేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

### ప్లస్‌టూ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు రాయగోరు ప్రైవేటు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ ప్రకటన విడుదల చేసింది. అభ్యర్థులు విద్యా జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ ఈ-సేవా కేంద్రాలకు వెళ్లి, రుసుము చెల్లించి ఈ నెల 17వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఇచ్చే రసీదు నెంబరు ఆధారంగా 'హాల్ టిక్కెట్లు' డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. వివరాలకు www.dge.tn.gov.inలో సంప్రదించవచ్చు.

### శివనాడార్ వర్శిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రారంభం

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శివనాడార్ విశ్వవిద్యాలయంలో 2025వ విద్యాసంవత్సరానికి పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఇంగ్లీషు, బిజినెస్, ఎకనామిక్స్, మ్యాథమేటిక్స్ సహా పాఠ్యాంశాల్లో పీజీ డిగ్రీలు పొందిన వారు ఈనెల 13వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే, 8.5 కంటే ఎక్కువ సీజీపీఏ ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులు నేరుగా పీహెచ్‌డీలో చేరవచ్చు. వివరాలకు Phdadmissions @snuchennai.edu.inలో సంప్రదించాలని వర్శిటీ పేర్కొంది.

### 'సీఎం ఫార్మశీ' దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాలో 'సీఎం ఫార్మశీ' ఏర్పాటుకు దరఖాస్తు స్వీకరణ ఈనెల 10వ తేది వరకు పొడిగించారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 5వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఇదివరకే ప్రకటించగా, ఆ గడువును ఈనెల 10వ తేది వరకు పొడిగించారు. 110 చదరపు అడుగులకు తక్కువ కాకుండా సొంత, అద్దె భవనం ఉండాలి. అలాగే, ఆస్తి పన్ను, తాగునీటి పన్ను, విద్యుత్ కనెక్షన్ రసీదు, ఒకవేళ అద్దె తీసుకుంటే అందుకు సంబంధించిన అంగీకారం పత్రం తదితరాలతో www.mudhalvarmarun dhagam.tn.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు.

### కార్తీక దీపోత్సవాలకు 4,089 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాలకు 4,089 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు విల్లుపురం ప్రాంతీయ రవాణా సంస్థ తెలిపింది. ఈ విషయమై ఆ సంస్థ విడుదల చేసిన ప్రకటనలో... తిరువణ్ణామలైలో 9 తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి గిరి ప్రదక్షిణ మార్గానికి భక్తులు వెళ్లేలా 40 మినీ బస్సులు నడుపుతున్నామన్నారు. అలాగే, 150 ప్రైవేటు బస్సులను కూడా అద్దెకు తీసుకుని నడుపుతామన్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

### రిజిస్ట్రేషన్ శాఖలో ఒకే రోజు రూ.238 కోట్ల ఆదాయం

మంత్రి మూర్తి

ప్యారీస్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో ఈనెల 5వ తేదీ ఒకే రోజు పత్రాల రిజిస్ట్రేషన్ ద్వారా రూ.238.15 కోట్ల ఆదాయం వచ్చిందని రాష్ట్ర మంత్రి పి.మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఆదాయం రాబట్టుకోవడంలో రిజిస్ట్రేషన్ శాఖ కీలక పాత్ర వహిస్తుందని, ఈ శాఖ చరిత్రలోనే ఇప్పటి వరకు లేని విధంగా ఈనెల 5వ తేదీన కార్తిక మాసం శుభముహూర్తాన పత్రాల రిజిస్ట్రేషన్‌ల ద్వారా రూ.238.15 కోట్లు ఆదాయం సమకూరినట్టు తెలిపారు. గత నవంబర్‌లో రూ.1,984.02 కోట్ల ఆదాయం ఆస్తులకు సంబంధించిన పత్రాల రిజిస్ట్రేషన్‌ల ద్వారా వచ్చిందని, ఇది గత 2013 నవంబర్ కంటే అదనంగా రూ.301.87 కోట్ల ఆదాయం రాబట్టుకుని రికార్డు నెలకొందన్నారు. శుభముహూర్తం రోజుల్లో ప్రజలు లబ్ధిపొందే విధంగా పంపిణీ చేస్తున్న టోకెన్ల సంఖ్యను 100 నుంచి 150కు పెంచినట్లు మంత్రి మూర్తి తెలిపారు.

# డీఎంకే కూటమిలో చిచ్చుకు యత్నం

● తిరుమా ఆరోపణ


డీపీఐ కార్యాలయంలో అంబేద్కర్ పుస్తకావిష్కరణ

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకే నేతృత్వంలోని కూటమిలో గందరగోళం సృష్టించే విధంగా అదవ్ అర్జున వ్యాఖ్యలు చేయడంపై ఆయన వద్ద వివరణ కోరనున్నట్టు డీపీకే అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్ పేర్కొన్నారు. సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న అంబేడ్కర్ పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న డీపీఐ ప్రధాన కార్యదర్శి అదవ్ అర్జున డీఎంకే కూటమిని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. వీటిపై స్పందించిన తిరుమా స్థానిక అశోక్ నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... కలిసికట్టుగా రాజకీయాల్లో ముందుకు సాగుతున్న డీఎంకే కూటమిలో చిచ్చుపెట్టేలా వ్యాఖ్యలు చేసిన అదవ్ అర్జున్ వద్ద వివరణ కోరనునున్నట్టు ఆయన తెలిపారు.

### అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నాం

● మంత్రి అన్బిల్

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకే, డీపీఐ నేతలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నామని రాష్ట్ర మంత్రి అన్బిల్ మహేశ్ తెలిపారు. డీపీఐ అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్‌పై ఆ పార్టీ నేత అధవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపై మంత్రి అన్బిల్ శనివారం స్పందించారు. తిరుమావళవన్ గొప్ప, ఆత్మాభిమానం కలిగిన నేత అని చెప్పారు. ఆయనపై ఒత్తిడి తెచ్చి ఒక పనిని చేయించలేరన్నారు. అధవ్ అర్జున్ చేసిన వ్యాఖ్యలపై తమ పార్టీ అధినేత ఎంకే స్టాలిన్, తిరుమావళవన్ చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారన్నారు. ఇదిలావుండగా, ఎవరికి మైనస్ అనే విషయం రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టంగా తెలుస్తుందని రాష్ట్ర మంత్రి మదివేందన్ పేర్కొన్నారు.

### మిత్ర పక్షాలను అవమానించం : మంత్రి రఘుపతి

ప్యారీస్, డిసెంబర్ 7, (ఆంధ్రజ్యోతి): మిత్ర పక్షాలను అవమానించే ఉద్దేశం డీఎంకేకు లేదని న్యాయ శాఖ మంత్రి రఘుపతి పేర్కొన్నారు. స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ 'అందరి నాయకుడు బాబా సాహెబ్ అంబేడ్కర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి, ప్రసంగిస్తూ.. అధికార డీఎంకేని ఘాటుగా విమర్శించారు. 2026లో అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో 200 నియోజకవర్గాలకు పైగా విజయం సాధిస్తామన్న అధికార పార్టీ గణాంకాలన్నీ తేలిపోతాయని, రాజుల పాలనను ప్రజలే గద్దె దించుతారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. విజయ్ వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి రఘుపతి శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. కూటమిలో ఉన్న మిత్రపక్షాలను అవమానించే ఉద్దేశం డీఎంకేకు లేదన్నారు. రాజకీయలలో ప్లస్, మైనస్‌లుగా అయ్యేందుకు అవకాశం లేదని, డీఎంకేది రాజుల పాలన కాదని, ప్రజాస్వామ్యంగా పరిపాలిస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి కేటాయించడంపై రాజకీయం చేయరాదన్నారు. వేంగైవాయల్ వ్యవహారంపై ఏక సభ్య కమిటీ విచారణ కొనసాగిస్తుందని, ఈ వ్యవహారంలో మంత్రులు, ఎమ్మెల్యేల జోక్యం లేదని, ఎవరిని కాపాడాల్సిన అవసరం డీఎంకేకు రాలేదని స్పష్టం చేశారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులు

పెరంబూర్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య పెరిగిందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. తిరుచ్చిలో శనివారం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... విద్యార్థుల సంఖ్యకు తగినట్లు అదనపు ఉపాధ్యాయులను నియమించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల భర్తీకి రాతపరీక్ష ద్వారా 3,000 మందిని ఎంపిక చేసి, వారి సర్టిఫికెట్ల పరిశీలన పనులు జరుగుతున్నాయన్నారు. బోధనేతర సిబ్బంది భర్తీలో తమకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలుచేశారని, అందువల్ల 3,000 మందికి నియమాక ఉత్తర్వులు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. గత అన్నాడీఎంకే హయాంలో ఉపాధ్యాయుల నియామకాల్లో అలసత్వం చూపడంతో, యూజీ టీచర్ల ఖాళీలు ఏర్పడ్డాయని మంత్రి తెలిపారు.

### రైలులో తరలిస్తున్న రూ.75 లక్షల నగదు స్వాధీనం


నగదుతో పట్టుబడిన ఆరోగ్యదాస్

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హౌరా నుంచి తిరుచ్చికి చేరుకున్న హౌరా ఎక్స్‌ప్రెస్‌లో రూ.75 లక్షల నగదును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి రైల్వేస్టేషన్‌కు శనివారం తెల్లవారుజామున వచ్చిన రైలు ప్రయాణికులను పోలీసులు తనిఖీ చేశారు. సమయంలో యువకుడిని అనుమానించిన పోలీసులు, అతని బ్యాగు తనిఖీ చేయగా కట్టలు కట్టలుగా రూ.75 లక్షలు ఉండడం గమనించారు. అతను శివగంగ జిల్లా దేవకోటకు చెందిన ఆరోగ్యదాస్ అని తెలిసింది. నగదుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి రశీదులు లేకపోవడంతో, ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అతనిని అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

### అసెంబ్లీ హాల్ మరమ్మతులకు రూ.3 కోట్లు

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, రూ.3 కోట్లతో అసెంబ్లీ హాలు మరమ్మతులు జరుగుతున్నాయి. డీఎంకే అధికారం చేపట్టిన 2021 తర్వాత, కరోనా కారణంగా కలైవానర్ ఆడిటోరియంలో తాత్కాలికంగా అసెంబ్లీ హాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించారు. కరోనా వ్యాప్తి తగ్గుముఖం పట్టిన అనంతరం, మళ్లీ జార్జి కోటలోని అసెంబ్లీ హాలుకు సమావేశాలను మార్చారు. ఆ సమయంలో రూ.5 కోట్లతో కుర్చీలు, విద్యుద్దీపాలు అమర్చారు. అలాగే, కాగితరహిత అసెంబ్లీ సమావేశాలుగా మార్చేలా, మంత్రులు, ఎమ్మెల్యే టేబుళ్లపై చిన్న కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. అక్కడక్కడా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, శాసనసభ సమావేశాలకు సంబంధించిన వివరాలు తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలో, అసెంబ్లీ సమావేశాలు మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో, రూ.3 కోట్లతో మౌలిక వసతుల కల్పన, టాయిలెట్లు తదితర పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

### వరద బాధితులకు సహాయాల పంపిణీ

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తుఫాను బాధిత కడలూరు జిల్లాల్లో నివారణ సహాయాల పంపిణీని మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం ప్రారంభించారు. 'ఫెంగల్' తుఫాను కారణంగా నష్టపోయిన కడలూరు, విల్లుపురం తదితర జిల్లాల్లో రేషన్ కార్డుదారులకు తలా రూ.2,000 నగదు, బియ్యం, కందిపప్పు అందించనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు కడలూరు గుండుఉప్పలవాడిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, బాధితులకు తలా రూ.2 వేల నగదు, ఐదు కిలోల బియ్యం, కిలో కంది పప్పు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జిల్లాల్లో 1,390 గృహాలు వరద ఉధృతిలో ధ్వంసమయ్యాయన్నారు. వారికి 'కలైంజర్ కనవు ఇల్లం' పథకంలో ఇళ్ల నిర్మాణాల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు.

### ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి మురుగన్ కృతజ్ఞతలు

ఐసిఎఫ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ కేంద్ర సమాచార శాఖ మంత్రి ఎల్.మురుగన్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేశారు. ఫెంగల్ తుఫాను కారణంగా కడలూరు, విల్లుపురం, తిరువణ్ణామలై జిల్లాల్లో వరద ముంచెత్తింది. వరద బాధిత జిల్లాలను ఆదుకొనేలా నిధులు అందించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి రూ.944.80 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో, నిధులు అందజేసిన ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాకు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు కేంద్ర మంత్రి మురుగన్ పోస్ట్ చేశారు.

### ఏర్కాడు నుంచి చెన్నై, మదురైలకు బస్సు సౌకర్యం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏర్కాడు నుంచి చెన్నై, మదురై ప్రాంతాలకు నేరుగా బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఏర్కాడుకు ప్రతిరోజు వందలాది పర్యాటకులు వస్తుంటారు. వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతోంది. ఈ క్రమంలో, ప్రధాన నగరాలైన చెన్నై, మదురై లకు ఏర్కాడుకు నేరుగా బస్సు సర్వీసులు లేకపోవడంతో, ఆ ప్రాంతాలకు చెందిన వారు రెండు, మూడు బస్సులు మారాలిసిన పరిస్థితి నెలకొంది. పర్యాటకుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) చెన్నై, మదురైలకు నేరుగా బస్సులు నడపాలని నిర్ణయించింది. ఈ బస్సు సేవలను శనివారం మంత్రి రాజేంద్రన్ ప్రారంభించారు.

### రాష్ట్రంపై కేంద్రం పక్షపాత వైఖరి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విపత్తు నివారణ నిధులు అందజేయడంతో కేంద్రప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఫెంగల్ తుఫాను తాకిడికి రాష్ట్రంలో 14 జిల్లాలు భారీ నష్టం చవిచూశాయని, ఆ జిల్లాల్లో తిరిగి యధాస్థితికి చేరుకొనేందుకు 6 నెలలు పడుతుందన్నారు. తుఫాను బాధిత ప్రాంతాల్లో నివారణ చర్యలు, బాధితులకు తగిన సహాయాలు అందించడం తదితరాలకు రూ.2,475 కోట్లు మంజూరు చేయాలని సీఎం ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తు చేశారు. కానీ, కేంద్రం కేవలం రూ.945 కోట్లు అందజేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి బాధిత ప్రాంతాల పునరుద్ధరణకు సరిపడా నిధులు అందించాలని ముత్తరసన్ డిమాండ్ చేశారు.

### నీటమునిగి ముగ్గురు బాలుర మృతి

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో నీటమునిగి ముగ్గురు బాలురు మృతి చెందారు. సానార్‌పట్టి సమీపంలోని కుళ్లకుత్తు వాగులో శనివారం సాయంత్రం స్నానం చేసేందుకు గోకుల్ (12), యాదేశ్వర్ (8), ఇన్బరాజ్ వెళ్లారు. వారు సరదాగా వాగులో స్నానం చేస్తున్న సమయంలో ఊహించని విధంగా ముగ్గురూ లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. గమనించిన చుట్టుపక్కల వారు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బందితో అక్కడికి చేరుకున్న పోలీసులు, గంట సేపు శ్రమించి మృతదేహాలు వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

# మొబైల్ ఫోన్ వినియోగం తగ్గించండి


సూచనలిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మీరా

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొబైల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని విద్యార్థులకు పోలీసులు సలహా ఇచ్చారు. కోయంబత్తూర్ జిల్లా వాల్పారై ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో 'మహిళ భద్రత' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి అధ్యక్షత వహించగా, మహిళా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మీరా పాల్గొని, విద్యార్థినులు చేపట్టాల్సిన భద్రతా అంశాలు వివరించారు. పాఠశాలకు వచ్చే సమయంలో ఆకతాయిలు హేళన చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించడం, సంప్రదాయ వస్త్రధారణతో పాఠశాలకు రావాలని ఆమె సూచించారు.

### తిరువణ్ణామలైలో మళ్లీ విరిగిపడిన మట్టిచెరియలు


మట్టిచెరియలు విరిగిపడిన ప్రాంతంలో సహాయక చర్యలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో కార్తీక దీపం వెలిగించేందుకు కొప్పెర తీసుకెళ్లే ప్రాంతంలో 400 అడుగల మేర మట్టిచెరియలు విరిగి పడినట్లు సమాచారం. 'ఫెంగల్' తుఫాను ప్రభావంతో తిరువణ్ణామలైలో గత శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. గత ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మహాదీపం వెలిగించే కొండపై 4 ప్రాంతాల్లో మట్టిచెరియలు విరిగిపడ్డాయి. ఓ ఇంటిపై మట్టిచెరియలు పడడంతో శిథిలాల కింద చిక్కుకొని ఏడుగురు మృతిచెందారు. ఈ నేపథ్యంలో, ఈనెల 13న మహా దీపం వెలిగించనున్న నేపథ్యంలో, కార్తీక దీపం వెలిగించే కొప్పెర ఉంచే ప్రాంతం, అరైమలై ప్రాంతంలో సుమారు 600 అడుగుల మేర మళ్లీ మట్టిచెరియలు విరిగిపడ్డాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. మట్టిచెరియలు విరిగిపడిన కొండ ప్రాంతాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

### మంత్రి చొరవతో విద్యార్థి చేతికి ల్యాప్‌టాప్

ఐసిఎఫ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బస్సులో ల్యాప్‌టాప్ పోగొట్టుకున్న యువకుడు మంత్రి చొరవతో దాన్ని తిరిగి పొందాడు. చిదంబరం నుంచి ఈనెల 5వ తేది చెన్నైకు వస్తున్న ప్రభుత్వ బస్సులో చంద్రు ప్రయాణించాడు. అతను తన ల్యాప్‌టాప్ బ్యాగును సీటుపై ఉన్న లగేజీ అరలో ఉంచాడు. అర్ధరాత్రి కావడంతో తను దిగాల్సిన కడలూరు బస్టాండ్ రావడంతో, చంద్రు హఠాత్తుగా నిద్ర నుంచి లేచి దిగేశాడు. అనంతరం బస్సు వెళ్లిపోగా, తన ల్యాప్‌టాప్ బ్యాగ్ బస్సులో ఉండిపోయిందని చంద్రు గుర్తు తెచ్చుకున్నాడు. తన స్నేహితుడి ద్వారా రవాణా శాఖ మంత్రి శివశంకర్ సెల్‌ఫోన్ నెంబరు తీసుకున్న చంద్రు, ఆ రాత్రి వేళ మంత్రిని సంప్రదించి విషయం తెలిపాడు. తన ఉద్యోగానికి సంబంధించిన ముఖ్యమైన దస్తావేజులు, సమాచారం ల్యాప్‌టాప్‌లో ఉందని చంద్రు మంత్రికి వివరించారు. మంత్రి వెంటనే విల్లుపురం రవాణా శాఖ మేనేజర్‌కు ఫోన్ చేసి విషయం తెలిపారు. అధికారులు వెంటనే బస్సు డ్రైవర్‌ను సంప్రదించి విషయం తెలపగా, డ్రైవర్ బస్సులో ల్యాప్‌టాప్ బ్యాగ్ తీసుకున్నాడు. దీంతో, కడలూరుకు వెళ్లే మరో బస్సులో ల్యాప్ టాప్ పంపించాలని సూచించిన మంత్రి, ఈ విషయాన్ని చంద్రుకు తెలిపాడు. అనంతరం కడలూరుకు వచ్చిన బస్సులో బ్యాగ్ తీసుకున్న చంద్రు, మంత్రి, రవాణా శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



### శివనామస్మరణతో మార్మోగిన తిరువణ్ణామలై

వేలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయ కార్తీక దీపోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం రాత్రి పంచమూర్తులు వివిధ వాహనాల్లో మాడవీధుల్లో విహరించారు. అరుణాచలేశ్వరుడు, ఉన్నామలై అమ్మవార్లు సింహ వాహనం, వల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, వినాయకుడు, పరాశక్తి, చండికేశ్వరుడు వివిధ వాహనాల్లో విహరించారు. కర్పూర హారతులతో నీరాజనం పలికారు.



### ముమ్మరంగా టీఎంసీ సభ్యత్వ నమోదు


పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్‌కు కొత్త సభ్యుల వివరాలు అందజేస్తున్న జీఆర్ వెంకటేష్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ)లో సభ్యత్వ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో, పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్‌కు సెంట్రల్ చెన్నై ఈస్ట్ జిల్లాలో కొత్తగా సభ్యత్వం తీసుకున్న వారి వివరాల జాబితాను పార్టీ ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు నందు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నిర్వాహకులు మనోహర్ బాషా, కృష్ణన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ ఎండీ మధుసూదన్‌రెడ్డి కన్నుమూత


ఎస్.మధుసూదన్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్' మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి (46) కన్నుమూశారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో తీవ్ర గుండెపోటుకు గురై కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్థానిక అన్నానగర్ వెస్ట్, 13 వీధిలోని ఆయన స్వగృహంలోనే భౌతికకాయాన్ని ఉంచారు. ఆదివారం ఉదయం 12 గంటలకు ఇంటి నుంచి అంతిమయాత్ర బయలుదేరుతుందని కుటుంబీకులు తెలిపారు. అంబత్తూరులోని డన్‌లప్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరగనున్నాయి. మధుసూదన్‌రెడ్డి ప్రముఖ పారిశ్రామికవేత్త పి.జనార్దన రెడ్డి మేనల్లుడే. మధుసూదన్ రెడ్డి మృతి పట్ల జనార్దన రెడ్డితో పాటు ఆయన కుమారుడు డాక్టర్ పి.ధీరజ్‌రెడ్డి, పలువురు తెలుగు ప్రముఖులు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన మృతితో తమ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొందన్నారు.

### 14న గ్రూప్-2 పోస్టులకు ఆన్‌లైన్ పరీక్ష

ఐసిఎఫ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2 పోస్టులను టీఎన్‌పీఎస్సీ భర్తీ చేయనుంది. ప్రభుత్వ అసిస్టెంట్ ప్రాసిక్యూషన్ ఆఫీసర్ (గ్రేడ్-2) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 14న ఆన్‌లైన్‌లో పరీక్ష జరగనుంది. అభ్యర్థులు హాల్ టిక్కెట్లు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### చెన్నైలో ల్యాండైన బెంగళూరు విమానం

ఐసిఎఫ్, డిసెంబరు 7: బెంగళూరుకు వెళ్లాల్సిన విమానం చెన్నైలో ల్యాండైంది. న్యూఢిల్లీ నుంచి 150 మంది ప్రయాణికులతో బెంగళూరుకు ఎయిర్ ఇండియా విమానం శనివారం ఉదయం బయల్దేరింది. బెంగళూరు విమానాశ్రయంలో దట్టమైన పొగమంచు కురుస్తుండడంతో ల్యాండింగ్‌కు అనుకూలించలేదు. దీంతో, ఉదయం 7 గంటల సమయంలో చెన్నై విమానాశ్రయంలో ల్యాండింగ్ చేసి, ప్రయాణికులు వెయిటింగ్ హాలులో ఉంచారు. బెంగళూరులో వాతావరణం అనుకూలించడంతో 8.30 గంటలకు విమానం బయల్దేరి వెళ్లింది.

### తపాలా కార్యాలయాల మూసివేతను వెనక్కు తీసుకోండి : ఎంపీ వెంకటేశన్

ఐసిఎఫ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో తపాలా కార్యాలయాలను మూసివేయాలనే నిర్ణయాన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేస్టేషన్లలో తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో నగదు పరివర్తన చేస్తుండడంతో రైల్వేస్టేషన్లలో తపాలా కార్యాలయాలకు ప్రజలు రావడం లేదని సమాచారం. దీంతో రాష్ట్రంలోని 10 రైల్వేస్టేషన్లు సహా దేశవ్యాప్తంగా 93 రైల్వేస్టేషన్లలో ఉన్న తపాలా కార్యాలయాలను మూసివేయాలని ఆగస్టు 17న తపాలా శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, రైల్వేస్టేషన్లలోని తపాలా కార్యాలయాలు డిజిటలైజేషన్ విధానంలో పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీ వెంకటేశన్ డిమాండ్ చేశారు.

### 'మళ్లీ దాడికి పాల్పడతావా?'

● చేయనంటూ తలూపి సైగ చేసిన దైవానై



పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'మళ్లీ ఎవరి పైనన్నా దాడి చేస్తావా?' అంటూ కొత్త మావటి అడిగిన ప్రశ్నకు 'చేయను' అనేలా తలూపి సైగ చేసింది ఆలయ ఏనుగు 'దైవానై'. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో పర్యవేక్షిస్తున్న 26 ఏళ్ల దైవానై ఏనుగు, గత నెల 18వ తేది హఠాత్తుగా దాడి చేయడంతో మావడి ఉదయకుమార్, అతని బంధువు శిశుపాలన్ మృతి చెందిన విషయం విదితమే. అనంతరం అటవీ శాఖ అధికారులు, వెటర్నరీ వైద్యుల నేతృత్వంలోని బృందం ఏనుగును ప్రత్యేక గదిలో ఉంచి పర్యవేక్షించారు. వారం రోజుల అనంతరం ఏనుగు సహజ స్థితికి చేరుకుందని పేర్కొన్న వైద్యులు, దానికి స్నానం చేసేందుకు అనుమతించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఏనుగు దైవానైను పరిశీలించిన అటవీ శాఖ వెటర్నరీ వైద్యుడు మనోహరన్, ఆర్మగనేరి వెటర్నరీ అసిస్టెంట్ వైద్యుడు అరుణ్‌కుమార్ వాకింగ్‌కు తీసుకెళ్లవచ్చని సూచించారు. దీంతో, భక్తులు తక్కువగా ఉన్న ప్రాంతంలో ఏనుగును వాకింగ్‌కు తీసుకెళ్లాలని ఆలయ అధికారులు నిర్ణయించారు.

### రోడ్లను కమ్మేసిన మంచు

● వాహనచోదకుల ఇక్కట్లు


హెడ్ లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు, పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న దట్టమైన పొగమంచుతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం 'ఫెంగల్' తుఫాను ప్రభావంతో చెన్నై, చెంగల్పట్టు సహా పలు జిల్లాల్లో భారీవర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించిన విషయం విదితమే. ఈ వారం ప్రారంభం నుంచే పొగ మంచు కురవడం ప్రారంభమైంది. మంచుకు గాలులు తోడవడంతో చలి తీవ్రత పెరిగింది. ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగ మంచు కురుస్తుండడంతో, జాతీయ రహదారులపై హెడ్ లైట్లు వేసుకొని వాహనాలు నడపాల్సి వస్తుందని డ్రైవర్లు పేర్కొంటున్నారు.

### మత్తుమాత్రలు విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో మత్తు మాత్రలు విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వాషర్‌మెన్‌పేటలో మత్తు మాత్రల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో, పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించి కుండ్రత్తూర్ అమ్మన్ ఆలయ వీధికి చెందిన వెంకటేష్, సూర్యప్రకాష్, పోరూర్ కెరుగంబాక్కంకు చెందిన ఆకాష్‌రాజా, 17 ఏళ్ల బాలుడిని అరెస్ట్ చేసి, వారి నుంచి 3,700 మత్తుమాత్రలు, 10 మొబైల్‌ఫోన్లు, రూ.22,500 నగదు, 3 కత్తులు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడి మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బర్గూర్ సమీపం తపాలా మేడు వద్ద కారు ఢీకొన్న ఘటనలో తల్లీ, కుమారుడు మృత్యువాతపడ్డారు. రోడ్డు పక్కన నిలబడి మాట్లాడుకుంటున్న కుమారత్తి (50), ఆమె కుమారుడు తిరుపతి (35)లను ఆ మార్గంగా వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలో మృతి చెందారు. అలాగే, గాయపడిన మునుస్వామి, గీతను చుట్టుపక్కల వారు అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### ఆర్టీఓ కార్యాలయంలో రూ.3.62 లక్షల స్వాధీనం

ఐసిఎఫ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా మధుకరై మరప్పాలం ప్రాంతంలో ఉన్న ఆర్టీఓ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ కార్యాలయం అందిస్తున్న సేవలకు అధికారులు, సిబ్బంది లంచం ఆశిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో లెక్కల్లో చూపని రూ.3.62 లక్షలను స్వాధీనం చేసుకున్న అధికారులు, కార్యాలయ అధికారులు, సిబ్బందిని విచారిస్తున్నారు.

SUNDAY SPECIAL







# కోయంబత్తూరులో మరో 'రంగనాథన్ వీధి'

● చౌకధర వస్తువులకు పెట్టింది పేరు 'ఉప్పు కినరు తెరు'

టి.నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటేనే ఏ నగరమైనా త్వరగా అభివృద్ధి చెందగలుగుతుంది. కోయంబత్తూరు అలాంటి వాణిజ్య నగరమే. ఆ నగరం చెన్నై వంటి ప్రముఖ నగరాలతో పోటీ పడే రీతిలో రోజురోజుకూ ప్రగతిపథంలో పయనిస్తోంది. చెన్నై నగరం లాగే కోయంబత్తూరు నగరం కూడా షాపింగ్ మాల్స్, సినిమాహాళ్లు, రెస్టారెంట్లు అంటూ నేటి యువతరాన్ని ఆకట్టుకునేలా అన్ని హంగులు కలిగి ఉంటోంది. వాస్తవంగా చెప్పాలంటే కోయంబత్తూరులో ఇతర నగరాల్లో లేని ఎన్నో సదుపాయాలు కూడా ఉన్నాయి. అయితే ఆ నగరం విశిష్టత ఏదంటే ఓ వైపు నవీనత్వాన్ని పెంపొందించుకుంటూనే మరో వైపు తన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ తన ఉనికిని ఎలుగెత్తి చాటుకోవడమే. ఈ నేపథ్యంలో రాజధాని నగరం చెన్నై వాణిజ్యకేంద్రంగా ఉన్న టి.నగర్ రంగనాథన్ స్ట్రీట్‌ను తలపించేలా కోయంబత్తూరు నగరంలో ఎన్నో విశేషాలతో కూడుకున్న ఓ వీధి కూడా ఉంది. ఆ వీధి పేరు 'ఉప్పు కినరు తెరు' (ఉప్పు బావి వీధి). ఈ ఉప్పు కినరు వీధిలో నడచి వెళుతుంటే టి.నగర్ రంగనాథన్ స్ట్రీట్‌లో నడిచి వెళుతున్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ వీధి కూడా ఎన్నో వ్యాపారాలకు కేంద్ర బిందువుగా ఉంటోంది.

## 800లకు పైగా దుకాణాలు..

ఆ వీధిలోని ఇరుకు దారుల్లో 800లకు పైగా దుకాణాలు ఉన్నాయి. ఆ వీధి కోయంబత్తూరు టౌన్ హాలును ఆనుకుని ఉన్న సంత ప్రాంతంలో ఉంది. ఆ వీధి రాజా వీధికి నిట్టనిలువు దిశగాను, ఒప్పనకార వీధిని ఆనుకుని ఉంది. పండుగ సీజన్‌లలో మాత్రమే రాయితీలు అనే నిబంధన ఈ వీధికి ఎప్పటికీ వర్తించదు. ఎందుకంటే ఈ వీధిలో అమ్మే ప్రతివస్తువూ మార్కెట్ ధర కంటే చాలా చౌకగానే ఉంటుంది. అమ్మే ప్రతివస్తువు ధరా ప్రతి రోజూ రాయితీలు ప్రకటించినంత తక్కువ ధరగానే ఉంటుంది. నిరుపేదల నుంచి ధనవంతుల దాకా అన్ని వర్గాల ప్రజలూ, ప్రత్యేకించి యువతీ యువకులు వారికి నచ్చిన వస్తువులను కొనేందుకు ఈ ఉప్పు కినరు వీధిలోకే వెళతారు. ఈ వీధిలో జౌళి దుకాణాలు, కట్‌పీస్ దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ దుకాణాల తర్వాత సంఖ్యలో అధికంగా ఉన్నవి కవరింగ్ నగల దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్లే! ఈ షాపులకు అతికినట్లుగా కొన్ని వజ్రాల దుకాణాలు కూడా ఉన్నాయి. ప్రతిరోజూ ఈ వీధిలో జనసంచారం విపరీతంగానే ఉంటుంది. పండుగల సమయంలో అయితే ఇసుకవేస్తే రాలనంత జనం! పండుగల సమయంలో కోయంబత్తూరు నగరవాసులే కాదు, సరిహద్దుల్లోని కేరళవాసులు కూడా గుంపులు గుంపులుగా ఉప్పు కినరు వీధిలో వాలిపోతారు. జౌళి దుకాణాలలో గుట్టలు గుట్టలుగా పడి ఉన్న దుస్తులను జవురుకుని వెళతారు.



## ఆ వీధిలో నడక సాహసకృత్యమే...

పండుగల సీజన్‌లో టి.నగర్ రంగనాథన్ వీధిలో ఉన్నట్లు ఈ ఉప్పుకినరు వీధిలో నగరవాసులు నడవటం సాహసకృత్యమే..! ఎంతటి వారైనా, ఎవరైనా సరే జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేయాల్సిందే..! ఆ వీధిలో నడిచి వెళుతూ ఉన్నట్టుండి బ్రేక్‌లు వేసినట్లు ఎవరూ నిలువకూడదు. నిలిస్తే వెనుకనే వేగంగా వస్తున్న వ్యక్తులు మిమ్మల్ని అంతే వేగంతో ఢీకొట్టి కిందపడేయగలరు జాగ్రత్త..! ఆ వీధిలోని ఇరుకుదారులకు ఇరువైపులా దుకాణాల ముంగిట విదేశాలనుంచి సంతనోత్పత్తికి వేడంతాంగళకు వలస వచ్చిన వింత వింత పక్షుల్లా అందమైన ఆకర్షణీయమైన రంగుల్లో అందమైన చీరలు వరుసగా వేలాడుతుంటాయి. ఆ చీరలలో ఏదైనా నచ్చితే మీరు ముందూ వెనుకా, ఇరువైపులా చూసిన తర్వాతే ఆ దుకాణంలో అడుగుపెట్టడం శ్రేయస్కరం. ఆ ఇరుకువీధుల్లోనే దుకాణాల వద్ద నిలిచిన కుర్రాళ్ల ముఖాలను చూడకుండా వెళ్లటమూ అంతే మంచిది. లేకుంటే 'అక్కయ్యా ఇక్కడికి రండి.. అన్నయ్యా ఇక్కడికి రండి.. చుడీదారా? శారీయా' అంటూ ఆ కుర్రాళ్లు పెట్టే కేకలు షాపింగ్ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగివెళ్లినా మీ చెవుల్లో వినిపిస్తూనే ఉంటాయి. జాస్మిన్ బాడీ స్ప్రేలు, ముప్పై రూపాయల కమ్మలు, చైను, పది రూపాయలకు కూలింగ్ గ్లాస్, బెల్ట్, రివాల్వింగ్ బకుల్స్ అంటూ ఆ వీధిలో లభించని వస్తువంటూ ఏదీ లేదు.స్వదేశీ వస్తువులే కాదు, విదేశీ వస్తువులూ కూడా ఈ వీధిలో సరసమైన ధరలకే లభిస్తాయి. ప్రస్తుతం ఈ ఉప్పుకినరు వీధి టి.నగర్ రంగనాథన్ స్ట్రీట్‌కు గట్టి పోటీ ఇస్తున్నదనటం ఏ మాత్రం అతిశయోక్తి కానే కాదు...!

## ఎక్స్‌ప్రెస్ డెలివరీ టైలరింగ్‌షాప్‌లు..

ఈ వీధిలో ఏదైనా షాప్‌లో యువతులు చుడీదార్ కోసం రంగులో ఉన్న వస్త్రాన్ని చేతపట్టుకుని, దాన్ని ఎక్కడ కుట్టుకోవాలో తెలియక అవస్థలు పడాల్సిన అవసరమే లేదు. టి.నగర్ రంగనాథన్ స్ట్రీట్‌లో ఉన్నట్లే ఈ ఉప్పు కినరు వీధిలోనూ ఎన్నో టైలరింగ్ షాపులు ఉన్నాయి. ఆ వీధిలోనే ఉన్న 'ఒట్టేజస్' బిల్డింగ్ లోపలకు వెళితే చాలు, ఫాస్ట్‌ఫుడ్ షాపుల్లాగా ఎక్స్‌ప్రెస్ డెలివరీ టైలరింగ్ షాపులు వరుసగా ఉంటాయి. అక్కడున్న దుకాణాల సముదాయంలో ఏ దుకాణంలోనైనా వస్త్రాన్ని ఇస్తే చాలు అరగంటలో అందమైన చుడీదార్‌గా మీ చేతుల్లోకి తిరిగి రావటం ఖాయం. అదే బ్లౌస్‌బిట్ ఇస్తే జాకెట్‌గా తిరిగి రావటానికి సుమారు రెండు గంటలు పడుతుంది. ఒక వేళ మీరు కొన్న చుడీదార్ కొలతలలో ఏవైనా మార్పులు, చేర్పులూ చేయాలనుకుంటే 'ఆల్ట్రేషన్ టైలరింగ్‌షాప్‌లు' కూడా ఎన్నో ఉన్నాయి. కాలేజీ విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు తమ స్నేహితురాళ్లతో అక్కడే గుమికూడి 'విండోషాపింగ్' చేస్తుంటారు. తక్కువ ఖర్చులతో ఎక్కువ వస్తువులు కొనడానికి, గంటల తరబడి దుకాణాలలో ఉన్న సరకులను వీక్షిస్తూ కబుర్లాడుకుంటూ తిరగటానికి కూడా ఈ వీధి చాలా అనుకూలంగానే ఉంది. కొక్కీలు, హెయిర్ పిన్నులు, హెయిర్ బ్యాండ్లు, నెయిల్ పాలిష్ కూడా ఎక్కువగా అమ్ముడవుతాయి. ఈ వస్తువులన్నీ అక్కడి ఇందిరా స్టోర్స్‌లో సరసమైన ధరలకు లభిస్తాయి. అలంకరణ వస్తువులకు ఆ దుకాణం పెట్టింది పేరు..!



వధువు వేప చెట్టుకు మాంగల్యధారణ

## ప్రపంచ శాంతి కోరుతూ మర్రి, వేప చెట్లకు వివాహం

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోరుతూ మర్రి, వేప చెట్లకు గ్రామస్తులు వివాహం జరిపించారు. కృష్ణగిరి జిల్లా సుట్టికాడులో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరు ప్రపంచశాంతి కోరుతూ గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో ఉన్న మర్రి చెట్టు, పార్వతి స్వరూపమైన వేప చెట్టుకు తిరుకల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. వధూవరుల తరపున రెండు వర్గాలుగా విడిపోయిన గ్రామస్తులు, మంగళవాయిద్యాల నడుమ తాంబూలం పళ్లెంలో సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు. మర్రి చెట్టును వరుడిగాను, వేప చెట్టును వధువుగా అలంకరించారు. ఈ చెట్ల ముందు యాగశాల ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. అనంతరం కన్యాదానం కార్యక్రమం నిర్వహించి, మేళతాళాలు, వేద మంత్రోచ్చరణల నడుమ వేప చెట్టుకు మాంగాల్యధారణ చేశారు. కల్యాణం అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మదురైకి మరిన్ని విమానాలు

టి.నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంయి మదురై నగరానికి ఓ ప్రైవేటు విమానయాన సంస్థ ఈ నెల 20 నుంచి రాత్రిపూట విమాన సర్వీసులు ప్రారంభించనుంది. మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా స్థాయిని పెంచాలని, 24 గంటలూ విమానాల రాకపోకలు సాగేలా తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికుడు డిమాండ్ చేశారు. ఆ మేరకు అక్టోబర్ 1నుంచి విమానాశ్రయంలో 24 గంటలూ విమానాల రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఇప్పటివరకూ ఆ విమానాశ్రయంలో ఏ విమానయాన సంస్థా రాత్రిపూట విమానాలను నడపలేదు. ఈ నేపథ్యంలో చెన్నై నుంచి మదురైకి ఓ ప్రైవేటు విమానయాన సంస్థ రాత్రిపూట విమానాన్ని నడపనున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు ఈ నెల 20 నుంచి ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు చెన్నై నుంచి బయలుదేరే ఆ ప్రైవేటు సంస్థ విమానం రాత్రి 10.25 గంటలకు మదురైకి చేరుతుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు.

## పారిశ్రామిక, ఆర్థిక వృద్ధిలో కామరాజర్ పోర్ట్ ముందంజ

- కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్
- ఘనంగా పోర్టు సిల్వర్ జూబ్లీ వేడుకలు



కామరాజర్ పోర్ట్ హెరిటేజ్ మాస్టర్ ప్లాంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్

ప్యారీస్, డిసెంబర్ 7, (ఆంధ్రజ్యోతి): చెన్నై పోర్ట్ అథారిటీ అనుబంధ సంస్థ కామరాజర్ పోర్ట్ పారిశ్రామిక, ఆర్థిక వృద్ధిలో వేగంగా దూసుకుపోతోందని కేంద్ర ఓడ రేవులు, షిప్పింగ్, జల మార్గాల శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. స్థానిక రాజా అన్నామలైపురంలోని లీలాప్యాలెస్‌లో శనివారం 'కామరాజర్ పోర్ట్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో రాష్ట్ర ప్రజా పనులు, హైవేస్, మైనర్ పోర్టుల శాఖ మంత్రి ఏవీ వేలు, చెన్నై పోర్ట్, కామరాజర్ పోర్ట్‌ల చైర్మన్ సునీల్ పాలీవాల్, కామరాజర్ పోర్టు మెనేజింగ్ డైరెక్టర్ జెరీన్ సింధియా తదితర ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమంలో కామరాజర్ పోర్ట్ గత 25 ఏళ్లలో పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి అందించిన అంశాలు, హెరిటేజ్ మాస్టర్ ప్లాంట్ 2047పై ముద్రించిన బ్రోచర్‌ను ముఖ్య అతిథి కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని అందుకున్న ఈ పోర్ట్ ఎండీ జేపీ జెరీన్ సింధియా కామరాజర్ పోర్ట్ వహిస్తున్న పాత్ర గురించి సభకి వివరించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. రూ.520 కోట్లతో నాల్గో విడతగా ఈ పోర్ట్‌లో పూడికతీత పనులు, రూ.37 కోట్లతో రోజుకు సుమారు 10 లక్షల లీటర్ల సముద్రపు జలాలను శుద్ధీకరించే కొత్త ప్లాంట్, మరో రూ.25 కోట్లతో కామరాజర్ పోర్ట్‌లో కంట్రోల్ రూం తదితర ముఖ్యమైన పథకాలకు శంకుస్థాపన చేసి, ఈ పనులు త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పోర్ట్ అభివృద్ధికి కృషి చేసిన ఉద్యోగులు, వారి కుటుంబాలు, వాటాదారులు, ప్రభుత్వ అధికారులకి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా జెరీన్ సింధియా మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించే దిశగా గ్రీన్, ఎనర్జీ ఎఫెక్టివ్ పోర్ట్‌గా కామరాజర్ పోర్ట్ విజన్‌ను వివరించారు. ఈ వేడుకల్లో విశిష్ఠ అతిథులుగా పాల్గొన్న ప్రముఖ స్క్వాష్ క్రీడాకారిణి, నేపథ్యగాయని, నటి ఆండ్రియా జెర్నియా, పద్మశ్రీ అర్జున అవార్డు గ్రహిత దీపికా పల్లికల్‌ను ఘనంగా సత్కరించారు.

## బాలిక నిజాయితీ



నగదుతో కూడిన సంచిని అప్పగిస్తున్న బాలిక నిషాంతిని

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన లక్షల నగదును పోలీసులకు అందించిన బాలిక నిజాయితీని పలువురు అభినందించారు. శివగంగ జిల్లా దేవకోటకు చెందిన నిషాంతిని తన తండ్రితో ద్విచక్రవాహనంపై వెళుతోంది. ఆ సమయంలో రోడ్డు పక్కన పడివున్న సంచిని గమనించి, బైక్ ఆపాలని తండ్రితో చెప్పింది. కిందకు దిగి ఆ సంచిని పరిశీలించగా, అందులో నగదు, కొన్ని దస్తావేజులున్నట్లు గుర్తించింది. వెంటనే ఆ సంచిని సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించింది. విచారణలో... ఆ సంచి కల్లన్‌కుడి గ్రామానికి చెందిన మాణిక్యం అనే వ్యక్తిదని, పొరపాటున రోడ్డు పక్కన పడినట్లు తెలిసింది. మాణిక్యంను పోలీస్‌స్టేషన్‌కు రప్పించిన పోలీసులు, రూ. రూ.1.84 నగదు సహా సంచిని అప్పగించారు. బాలిక నిషాంతిని నిజాయితీని పోలీసులు, ప్రజలు అభినందించారు.



చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి, తనకు లభించిన తొలి చిత్రంలోనే బలమైన పాత్రలో నటించి శెభాష్ అనిపించుకున్న యంగ్ హీరోయిన్ శ్రుతి పెరియస్వామి. ఆమె నటించిన తొలి చిత్రం 'నందన్'. సీనియర్ నటుడు శశికుమార్ హీరో. మంచి విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రంలో శ్రుతి... సెల్వి అనే పాత్రలో ఒదిగిపోయారు. మోడలింగ్, న్యూట్రిషనిస్ట్, బుల్లితెర యాంకర్‌గా రాణించిన ఆమె... తాను ఎంతో అదృష్టవంతురాలినని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

# నేను అదృష్టవంతురాలిని

● 'నందన్' హీరోయిన్ శ్రుతి పెరియస్వామి

చిత్రజ్యోతి

**? మీ సొంతూరు**

! వేసవిలో లభించే మామిడి పండ్లకు పెట్టింది పేరైన సేలం. నాన్న పేరు పెరియస్వామి. ప్రభుత్వ ఉద్యోగి. అమ్మ టైలర్.

**? మీకు సినీ నేపథ్యం ఉందా**

! మా కుటుంబానికి ఎలాంటి సినీ నేపథ్యం లేదు. సేలంలో పాఠశాల విద్యను పూర్తి చేసుకుని, బి.టెక్‌కు చెన్నైకు వచ్చాను. ఈ కోర్సు పూర్తికాగానే నెస్లే కంపెనీలో న్యూట్రిషనిస్ట్‌గా చేరా. కాస్త ఎత్తుగా, అందంగా ఉండటంతో సినిమాల్లో ప్రయత్నించవచ్చు కదా కదా అంటూ నా స్నేహితులు ప్రోత్సహించారు.

**? మోడలింగ్‌లో ఎలా రాణించారు**

! ఐదేళ్ల క్రితం స్నేహితురాళ్లతో కలిసి కేరళలో జరిగిన ఓ మోడలింగ్ షోలో పాల్గొన్నా. అదృష్టవశాత్తు అందులో విజేతగా నిలిచా. ఆ తర్వాత కొన్ని కంపెనీల ప్రచార యాడ్లలో నటించే అవకాశం వచ్చింది. దీంతో ఉద్యోగం మానేశా. అదేసమయంలో వ్యాపార, వాణిజ్య కంపెనీల కోసం మోడలింగ్ చేశా. ఓ ప్రైవేటు టీవీ చానెల్‌లో అగ్రనటుడు కమల్ హాసన్ హోస్ట్ చేసిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు.

**? తొలి సినీ అవకాశం**

! నా ప్రచార యాడ్లు చూసిన దర్శకుడు శరవణన్ తొలి అవకాశం ఇచ్చారు. 'నందన్' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తారా అని అడిగారు. అయితే, ఓ బిడ్డకు తల్లిగా ధైర్యవంతురాలి పాత్ర అని చెప్పారు. అయితే, తొలి చిత్రంలోనే అమ్మ పాత్ర రావడంతో కాస్త వెనుకంజ వేశా. కానీ, దర్శకుడు ఇచ్చిన ధైర్యంతో అంగీకరించా. ఆ సినిమా నా కెరీర్‌కు బ్రేక్ ఇచ్చింది.

**? తొలి చిత్రంలోనే అనుభవం ఉన్న నటిగా ఎలా నటించారు**

! నిజమే.. ఈ సినిమాను చూసిన పలువురు సినీ ప్రముఖులు ప్రశంసించారు. సెల్వి పాత్రలో ఒదిగిపోయి, జీవించారంటూ కితాబిచ్చారు. అందుకే నేను అదృష్టవంతురాలిని

**? భవిష్యత్తులో ఎలాంటి చిత్రాల్లో నటించాలని ఉంది**

! మంచి పాత్రలను చేయాలని ఉన్నప్పటికీ.. ఫుల్‌లెంగ్త్ కామెడీ చిత్రంలో నటించాలని ఉంది.

**? 'నందన్' చిత్రంపై మీ స్పందన**

! ఇప్పటికీ అనేక గ్రామాల్లో ఓ వర్గానికి చెందిన సర్పంచులకు సరైన వేదిక, గుర్తింపు లభించడం లేదు. ఈ పరిస్థితి మారాలి. మారాలని బలంగా కోరుకుంటున్నా. ఈ సినిమా కోసం ఓ గ్రామానికి వెళ్లి కొన్ని రోజుల పాటు ప్రజల దిన చర్యలను గమనించా. అందుకే సినిమాలో గ్రామీణ సెల్విగా మెప్పించగలిగా.




## శశికుమార్ - సిమ్రాన్ జంటగా 'టూరిస్ట్ ఫ్యామిలీ'



'టూరిస్ట్ ఫ్యామిలీ' ఫస్ట్‌లుక్

సీనియర్ నటుడు శశికుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రానికి 'టూరిస్ట్ ఫ్యామిలీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సిమ్రాన్ హీరోయిన్. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్ విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. ఇతర పాత్రల్లో యోగిబాబు, మిథున్ జైశంకర్, కమలేష్, ఎంఎస్ భాస్కర్, రమేష్ తిలక్, బక్స్, ఇళంగో కుమారవేల్, శ్రీజా రవి తదితరులు నటించారు. అరవింద్ విశ్వనాథన్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి షాన్ రోల్డన్ సంగీతం. డెబ్యూ డైరెక్టర్ అభిషన్ జీవింత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందే ఈ చిత్రాన్ని మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్‌మెంట్ తరపున నిర్మాతలు నజరేత్ బసిలియన్, మహేష్ రాజ్ బసిలియన్, యువరాజ్ గణేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను శనివారం విడుదల చేశారు.



## సూరి సరసన ఐశ్వర్య లక్ష్మి!

కమెడియన్ నుంచి హీరోగా మారిన సూరి వరుస చిత్రాల్లో కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మరో కొత్త చిత్రానికి కమిట్ అయ్యారు. ఇందులో హీరోయిన్‌గా ఐశ్వర్య లక్ష్మిని ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రాన్ని 'విలంగు' పేరుతో వెబ్ సిరీస్‌ను రూపొందించిన దర్శకుడు ప్రశాంత్ పాండిరాజ్ దర్శకత్వం వహించనున్నారు. ఇందులో సూరి సరసన హీరోయిన్‌గా నటించేందుకు ఐశ్వర్య లక్ష్మిని సంప్రదించగా, ఆమె ఓకే చెప్పినట్టు సమాచారం. 'గరుడన్' సినిమా తీసిన లార్క్ స్టూడియోస్ నిర్మించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను, నటీనటుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఇదిలా ఉండగా సూరి హీరోగా నటించిన 'విడుదలై-2' ఈనెల 20న విడుదలకానుంది. ఇందులో విజయ్ సేతుపతి ముఖ్య పాత్రను పోషించిన విషయం తెలిసిందే.

## లఘు చిత్రాల ప్రదర్శన కఠినంగా మారింది

● దర్శకుడు ఆనంద్ పట్‌వర్ధన్



ఆనంద్ పట్ వర్ధన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న నిర్వాహకులు

ప్రస్తుతం డాక్యుమెంటరీ, లఘు చిత్రాలను ప్రదర్శించడం కష్టంగా మారిందని ప్రముఖ దర్శకుడు ఆనంద్ పట్‌వర్ధన్ అభిప్రాయపడ్డారు. పుదుచ్చేరి యూనివర్శిటీలోని ఎలక్ట్రానిక్ మీడియా అండ్ మాస్ కమ్యూనికేషన్, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, పుదుచ్చేరి ఫిల్మ్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే 12వ అంతర్జాతీయ డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను శుక్రవారం పుదుచ్చేరిలో ప్రారంభించారు. ఇందులో ఆనంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిత్రోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'షార్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీ చిత్రాలపై ప్రభుత్వమే విమర్శిస్తుండటంతో అలాంటి చిత్రాలను ప్రదర్శించడం కఠినంగా మారింది. ముఖ్యంగా గత పదేళ్లలో ఇది మరింత కష్టతరమైంది. గతంలో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించేందుకు ఎలాంటి సెన్సార్ అక్కర్లేదు. కానీ, ఇపుడు భారతీయ చిత్రాలకు సెన్సార్‌ను తప్పనిసరి చేశారు. అదే సమయంలో హాలీవుడ్ చిత్రాలకు సెన్సార్ అక్కర్లేదు. సాధారణంగా షార్ట్‌ఫిల్మ్, డాక్యుమెంటరీ చిత్రాలను తీయడం కష్టం. ఇపుడు వాటిని ప్రదర్శించడం మరింత కష్టంగా మారింది' అని అన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి రాష్ట్ర మంత్రి లక్ష్మీనారాయణన్, ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా కేక్ మిక్సింగ్

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని వందడుగుల రోడ్డులో ఉన్న అంబికా ఎంపైర్ హోటల్లో క్రిస్మస్ కేక్ మిక్సింగ్ సందడిగా జరిగింది. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ కేక్ మిక్సింగ్‌లో సినీ నిర్మాత, సంగీత స్వరకర్త రాజేష్ స్వామినాథన్, గోట్ సినిమా ఫేం కోమల్ శర్మ, గైర్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ రాధికా గణేశన్, ఎగ్జిక్యూటివ్ చెఫ్ శ్రీధర్, ఫుడ్, బేవరేజ్ మేనేజర్ మోహన్, జనరల్ మేనేజర్ కళాత్తినాథన్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేకమైన స్పిరిట్లు, అరబిక్ ఖర్జూరాలు, ఎంపిక చేసిన డ్రైఫ్రూట్లు తదితరాలతో ఆహారప్రియులకు చవులూరించేలా ప్లమ్ కేక్ రూపొందించనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.





# విరులు విరిసె.. తనువు మురిసె!

## వైభవంగా పద్మావతిదేవికి పుష్పార్చన





తిరుచానూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవ శోభ వెల్లివిరిసింది. అమ్మవారికి శనివారం పుష్పయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తిని శ్రీకృష్ణ ముఖమండపంలో కొలువుదీర్చారు. కుంభ మండల ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ యాగశాలలో హోమం నిర్వహించారు. అనంతరం నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయంలో ప్రాయశ్చిత హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని శ్రీకృష్ణముఖ మండపంలో బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి 14రకాల పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నయనానందకరంగా నిర్వహించారు.





ఎకరాకు రూ.2లక్షల ఆదాయం

విత్తనాలు నాటిన తర్వాత 30 రోజులకు వంగనారు సిద్ధమవుతుంది. దీనిని పొలంలో నాటుకోవాలి. 50 రోజులకు దిగుబడి మొదలవుతుంది. ఎకరాకు 70 నుంచి 80 వేలు ఖర్చవుతుంది. ఆరు నుంచి ఎనిమిది నెలల దాకా కాపు ఉంటుంది. మార్కెట్‌లో రేటు బావుంటే ఎకరాకు రెండు లక్షల దాకా ఆదాయం వస్తుంది.

# తింటే.. తాళ్వాయిపాడు వంకాయ తినాలి



కథనం పెళ్లకూరు,ఆంధ్రజ్యోతి

'వంకాయ వంటి కూరయు.. పంకజముఖి సీతవంటి భామామణియున్..' అని ఒక పద్యం ప్రచారంలో ఉంది. కూరగాయలన్నింటిలో వంకాయకున్న ప్రత్యేకత అది. 'వంకాయతో వెయ్యిరకాలు' అని కూడా అంటారు. అంటే.. వెయ్యి రకాల వంటలు చేయదగిన కూరగాయ- వంకాయ అని. కాస్త అతిశయోక్తి ఉంటే ఉండవచ్చునుగానీ తెలుగునేల మీద వంకాయకు ఉన్న ప్రాధాన్యం అటువంటిది. పొడుగూ, పొట్టి, తెల్ల, పచ్చ.. అంటూ వంకాయల్లో ఎన్నిరకాలున్నా.. చారలున్న తాళ్వాయిపాడు వంకాయ రుచికి ఏదీ దీటు రాదు. ఎలా వండినా కమ్మగా కరిగిపోయే ఈ వంకాయలకు అందుకే అంత డిమాండ్ ఉంది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో శ్రీకాళహస్తి- నాయుడుపేట జాతీయరహదారి మీద ఉండే ఊరే తాళ్వాయిపాడు.

- దేశవిదేశాల్లో డిమాండ్
- వందల ఎకరాల్లో సాగు



ముదురాకుపచ్చ చారలున్న లేతపచ్చ వంకాయలకు ప్రసిద్ధి తాళ్వాయిపాడు. ఈ గ్రామంలో వంద ఎకరాల్లో వంకాయ సాగు ఉండేది. జాతీయ రహదారి విస్తరణ, కొత్తగా వెలిసిన పరిశ్రమలకు భూములు పోవడం, ఉన్న భూములకు రియల్ ఎస్టేట్ విలువ పెరిగి బంగారంగా మారిపోవడంతో వంగసాగు 40 ఎకరాలకు తగ్గిపోయింది. ఊళ్లో సాగు తగ్గినా తాళ్వాయిపాడు వంకాయ సాగు అనేక సమీప గ్రామాలకు విస్తరించింది. తాళ్వాయిపాడులోని నర్సరీ నుంచి నారు తీసుకువెళ్లి వంగసాగు చేస్తున్నారు. చావలి, చెంబడిపాలెం, పెన్నేపల్లి, కానూరు, రోసనూరు, శిరసనంబేడు, నందిమాల, కానూరుబంగారం పేట, మోదుగులపాళెం, కప్పగుంట కండ్రిగ, చెన్నప్ప నాయుడుపేట, సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు, ఆబాక, అగ్రహారం, గూడూరు సమీపంలోని ఇందూరు చెంబడిపాళెం, వెందోడుల్లో దాదాపు 500 ఎకరాల్లో తాళ్వాయిపాడు వంకాయ సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలు మార్కెట్‌లో లభించవు. రైతులే తమ పంటనుంచి సేకరించి నారుపోసుకుంటారు. ఈ వంగకున్న డిమాండ్‌ను గ్రహించిన తాళ్వాయిపాడు రైతు కట్టా బాల సుబ్రహ్మణ్యం నర్సరీలో పెద్ద ఎత్తున వంగ నారు పెంచి అమ్ముతున్నారు. బెంగళూరు, హోసూరు ప్రాంత రైతులు కూడా ఇక్కడి నుంచి వంగ నారు తీసుకువెళ్తున్నారు.



### నేదురుమల్లికి ప్రియమైన వంకాయ

ఉమ్మడి ఏపీ ఒకనాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తరచూ తాళ్వాయిపాడు నుంచి హైదరాబాదుకు వంకాయలను తెప్పించుకునేవారు. ఢిల్లీ నుంచి వచ్చే నాయకులకు వీటితో వంటకాలు చేయించి పెట్టేవారు. ఆయన ఇచ్చే విందుల్లో తాళ్వాయిపాడు వంకాయలతో చేసిన కూరలను అతిథులు ఇష్టంగా తినేవారని చెబుతారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కాలంలో తాళ్వాయిపాడు నుంచి వంగనారు విమానంలో తెప్పించుకుని తన పెరటిలో వేయడంతో పాటూ, ఢిల్లీలోని కొందరు నాయకులకూ ఇచ్చారు. తాళ్వాయిపాడు వంకాయ రుచి ఎరిగిన ఈప్రాంతవాసులు తమ స్నేహితులకు తరచూ ఈ వంకాయలను పంపుతుంటారంటే అతిశయోక్తి కాదు.



### స్వర్ణముఖి నీటి మహిమ

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచీ తాళ్వాయిపాడులో వంగసాగు జరుగుతున్నట్టు చెబుతున్నారు. తాళ్వాయిపాడు వంకాయకు ఇంత కమ్మటి రుచికి కారణం స్వర్ణముఖి నదీతీరపు నేలలో పెరగడమేనని ఇక్కడి రైతులు చెబుతారు. ఇదే వంకాయ ఇతర ప్రాంతాల్లో పండినా, వాటికీ, ఈ ఊరిలో పండిన వంకాయకూ రుచిలో తేడా ఉంటుందంటారు. అందుకే ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలకు తాళ్వాయిపాడు వంకాయలు పంపుతుంటారు. ప్రముఖులు తమ బంధుమిత్రులకు కానుకగా తాళ్వాయిపాడు వంకాయలు పంపుతుండడాన్ని బట్టి దీని ప్రత్యేకను గ్రహించవచ్చు. బెంగళూరు, చెన్నై, తిరుపతి, నెల్లూరు బస్సుల్లో తాళ్వాయిపాడు వంకాయలు పంపేవారు. బస్తాలపై టీవీఎస్(తాళ్వాయిపాడు వంకాయల సర్వీస్) అని రాసేవారు. రవాణాలో సిబ్బంది, కూలీలు ఈ అక్షరాలున్న మూటలను ఎలా అంటే అలా పడేసేవారు కాదు.



### వంగకు డిమాండ్ ఎక్కువ

నాకున్న ఒకటిన్నర ఎకరా నేలలో 50 సెంట్లు వంగ సాగు చేస్తున్నా. మిగిలిన నేలలో ఆకు కూరలు, చిక్కుడు, బెండ వేశాను. అయితే వంగకున్న డిమాండ్ ఎప్పుడూ మిగిలిన వాటికి ఉండదు.

- మనుబోలు కార్తిక్, తాళ్వాయిపాడు.

### సేంద్రియమే ఎక్కువ

రెండు ఎకరాల విస్తీర్ణంలో వంగనారు పెంచుతాను. మంచి డిమాండ్ ఉంది. నారుకీ, సాగుకీ కూడా 80శాతం సేంద్రియ పద్ధతినే అనుసరిస్తాం. వేప కషాయం, పేడ ఎరువులనే నేలలో కలియదున్ని నారు నాటుకుంటాం. ఈ పద్ధతి వల్ల చీడపీడలు తక్కువగానే ఆశిస్తాయి. అప్పటికీ పురుగు ఆశిస్తే ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రసాయన మందులు పిచికారీ చేస్తుంటాం.

-కట్టా బాలసుబ్రహ్మణ్యం, నర్సరీ యజమాని, తాళ్వాయిపాడు.



### మా కుటుంబానికి ఆసరా

ఎన్నో ఏళ్లుగా మేం వంగ సాగు చేస్తున్నాం. లాభదాయకమైన పంట ఇది. ఉద్యానశాఖ అధికారుల సూచనలు కూడా తీసుకుంటూ ఉంటాం. కోతలు మొదలయ్యాక రోజు మార్చి రోజు మార్కెట్‌కి కాయలు పంపుతాం. మా కుటుంబానికి పెద్ద ఆసరా వంగసాగు.

- హరిప్రియ, వంగరైతు

## ఈ నంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయొద్దు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు, ఇంటర్నేషనల్ కాల్స్ వస్తే వెంటనే లిఫ్ట్ చేయకూడదని జిల్లా సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. ఏమరపాటుగా ఉంటే బ్యాంకు అకౌంట్లలో ఉండే డబ్బు కాజేస్తారని చెబుతున్నారు. తరచూ ప్లస్ 381 (సెర్బియా), ప్లస్ 255(టాంజానియా), ప్లస్ 563(లోవా) ప్లస్ 375(బెలారస్ ) వంటి కోడ్ నెంబర్లతో ఫోన్ రింగ్ అవుతుందని, వీటితో పాటు 94777455913, ప్లస్ 255901130460, ప్లస్ 56322553736, ప్లస్ 37052529259 తదితర నెంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయవద్దని సూచించారు. లిఫ్ట్ చేస్తే కేవలం మూడు సెకన్లలో ఫోన్‌లోని విలువైన సమాచారాన్ని కాజేసే అవకాశముందని వివరించారు. కాగా, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి, హ్యాష్ 90 లేకుంటే హ్యాష్ 09 నెంబర్లను ప్రెస్ చేయాలని కోరుతున్నారని, దాన్ని అంగీకరించవద్దని సూచించారు. పొరబాటున ఈ కోడ్‌లు ఎంటర్ చేస్తే యూజర్ సిమ్ కార్డు యాక్సెస్ కేటుగాళ్ల చేతికి వెళ్లే అవకాశముందని సైబర్ క్రైం సీఐ వినోద్ తెలిపారు.

## సైబర్ వలలో ఆర్టీసీ ఉద్యోగి

- రూ.1.18 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగి సైబర్ వలకు చిక్కాడు. వారి మాటలకు మోసపోయి తనతో పాటు కుమార్తె అకౌంటులోని రూ.1.18లక్షలు పోగొట్టుకున్నాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మీనగర్‌కు చెందిన సురేంద్రనాథరెడ్డి తిరుపతి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్నాడు. గతనెల 26వ తేదీన టీవీ డిష్ యాక్టివేషన్ చేయడానికి ప్రయత్నించాడు. ఆన్‌లైన్ ద్వారా కస్టమర్ కేర్ నంబరుకు ఫోన్ చేశాడు. ఆ సమయంలో సైబర్ క్రైం మోసగాళ్లు వాట్సాప్ ద్వారా రస్ట్ డస్క్ రిమోట్ యాక్సెస్ యాప్‌ను ఫోన్ ద్వారా డౌన్‌లోడ్ చేయించారు. దీంతో సురేంద్రనాథరెడ్డి మొబైల్ ఫోన్ నంబరును మెల్లగా యాక్సెస్‌లోకి తీసుకున్నారు. అకౌంట్‌లో బ్యాలెన్సు చెక్ చేయమని చెప్పారు. బ్యాలెన్సు చూడగా కుమార్తె అకౌంటులో ఉన్న రూ.28,001లు, సురేంద్రనాథరెడ్డి అకౌంటులో ఉన్న రూ.90,300 మొత్తం రూ.1.18లక్షలు మాయమైపోయాయి. దీనిపై శనివారం తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.2.97కోట్లు ఆదాయం లభించినట్టు శనివారం ఉదయం ప్రకటించింది.శుక్రవారం 75,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా,26,057మంది తలనీలాలు సమర్పించారు.

## ఫిబ్రవరిలో 'ఉప్పు కప్పురంబు' విడుదల

- హీరో సుహాస్



తిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కీర్తి సురేష్‌తో 'ఉప్పు కప్పురంబు' అనే చిత్రం షూటింగ్ జరుగుతోందని, ఫిబ్రవరిలో ఈ చిత్రం విడుదల కానుందని హీరో సుహాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న సుహాస్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన 'కలర్ ఫొటో' చిత్ర దర్శకుడు సందీప్ వివాహం కోసం తిరుమలకు వచ్చి స్వామి ఆశీస్సులు పొందినట్టు తెలిపారు. చాలా రోజుల తర్వాత మంచి దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. కాగా, ఆలయం ముందు సుహాస్‌ను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆయనతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

## అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు

### మూడు గేదెలు, ఒక ఆవు మృతి

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల కోసం తీసిన విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు, ఒక ఆవు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... రోసనూరు రాజుపాలెం అరుందతి కాలనీకి చెందిన రవి తన రెండు గేదెలు, ఒక ఆవును గురువారం ఉదయం మేత కోసం అడవిలోకి తోలుకెళ్లి వదిలాడు. చీకటి పడ్డాక కూడా గేదెలు, ఆవు రాకపోవడంతో మరసటి రోజు వస్తాయని భావించాడు. శుక్రవారం సాయంత్రం పశువులను తోలుకురావడానికి



అడవికి వెళ్లగా ఎక్కడా కనిపించలేదు. గాలించగా సమీపంలోని మామిడి తోటలో మృతి చెంది కనిపించాయి. అక్కడి పరిసరాలను పరిశీలించగా అడవి జంతువుల వేట కోసం తీసిన విద్యుత్ తీగలు కనిపించాయి. పశువులకు విద్యుత్ తీగలు తగిలి కాలిన గాయాలు ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మామిడి తోటను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మామిడి తోట యజమాని చెన్నైలో నివాసం ఉండడంతో స్థానికులు ఎవరో అడవి జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

## రెచ్చిపోయిన తాగుబోతులు

- మద్యం మత్తులో ప్రైవేటు ఇంజనీర్‌పై దాడి
- ముక్కంటి ఆలయ ఉద్యోగికి దేహశుద్ధి

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగి ఒకరు కొందరు తాగుబోతు మిత్రులతో కలిసి రెచ్చిపోయాడు. అకారణంగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీర్‌పై దాడి చేశాడు. ఈ ఘటనను చూసిన కొందరు స్థానికులు ఆలయ ఉద్యోగిని చితకబాదారు. శ్రీకాళహస్తికి చెందిన వినోద్ చౌదరి అనే యువకుడు రేణిగుంటలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో ఇంజనీర్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ తిరుపతి ప్రధాన రహదారి పక్కన ఉన్న తన అత్తగారి ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ నిలుచుని భార్యతో మాట్లాడుతూ ఉన్నాడు. కడప ప్రాంతానికి చెందిన భాస్కర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఒప్పందఉద్యోగిగా పనిచేస్తుంటాడు. ప్రస్తుతం ఆయన భక్తకన్నప్ప సదన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తికి చెందిన ముగ్గురితో పాటు ఊరందూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి పూటుగా మద్యం సేవించాడు. ఈ నలుగురు శ్రీరామ్‌నగర్ కాలనీ వద్ద వెళుతూ వినోద్ ఉన్న నిలబడి ఉన్న చోట ఆగారు. తమను చూసి ఏదో మాట్లాడుకుని నవ్వుతున్నారని దంపతులపైకి దురుసుగా దూసుకెళ్లారు. తాము కుటుంబ విషయాలు మాట్లాడుకుంటున్నామని వారిస్తున్నప్పటికీ భాస్కర్‌రెడ్డి చెప్పును చేతిలోకి తీసుకుని వీరంగం చేశాడు. అతనితోపాటు ఉన్న మరో ఇద్దరితో కలిసి దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న అత్త, భార్య తాగుబోతులను అడ్డుకున్నా వారు బూతులతో మరింత దాడికి పాల్పడ్డారు. భాస్కర్‌రెడ్డితో పాటు ఉన్న పళని అనే యువకుడు తాను పోలీసు అధికారులకు ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తుంటానని బెదిరింపులకు దిగాడు. కొందరు స్థానికులు గొడవను కట్టడిచేసేందుకు చొరవ తీసుకుని ఆలయ ఉద్యోగి అయిన భాస్కర్‌రెడ్డిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఆయన మాట వినకపోవడంతో చితకబాదారు. వినోద్ ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి వెంటనే భాస్కర్‌రెడ్డిని అతడి స్నేహితులను స్టేషన్‌కు పిలిపించి మందలించారు. మరోసారి ఇలా జరిగితే రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది



## తిరుమలలో కారు దగ్ధం

- ప్రయాణికులు సురక్షితం

తిరుమల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం రాత్రి ఓ కారు దగ్ధమైంది. కారులో ప్రయాణించిన భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌కు చెందిన భరత్ నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తన కారులో శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్నాడు. గది ఎలా పొందాలనే సమాచారం తెలుసుకునేందుకు బాలాజీ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కారును ఆపారు. ఈ క్రమంలోనే కారు ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన భరత్ కుటుంబ సభ్యులను, లగేజీని కారు నుంచి దింపేశాడు. ఏమైందో గుర్తించేలోపే కారు నుంచి నెమ్మదిగా మంటలు రావడం మొదలైంది. సమీపంలోని భద్రతా సిబ్బంది ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఈలోగా కారు నుంచి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. అదే సమయంలో అక్కడున్న భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- విభిన్న ప్రతిభావంతులకు డీఆర్వో నరసింహులు పిలుపు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు వెళ్లాలని డీఆర్వో నరసింహులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఇతరుల మీద ఆధారపడకుండా స్వయం కృషితో జీవించాలనే ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున విభిన్న ప్రతిభావంతులకు అన్ని సదుపాయాలను అందిస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు మాధవ, మురళి, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పద్మజ, విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## షార్‌లో 5కే రన్

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శనివారం ఇంటిగ్రిటీ 5కే రన్ నిర్వహించారు. దేశ శ్రేయస్సు, సంస్కృతి, సమగ్రత అనే నినాదంతో నిర్వహించిన 5కే రన్‌ను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రారంభించారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్ వద్దనున్న సతీష్ ధావన్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన 5కే రన్ అంతరిక్ష కేంద్రీయ పాఠశాల వరకు సాగింది. 5కే రన్‌లో షార్ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోల్ శ్రీనివాసులురెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, శంకరన్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసిటీలో ఈప్యాక్ పరిశ్రమ విస్తరణకు భూమిపూజ



వరదయ్యపాళెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ పరిశ్రమ, తమ అధునాతన ఉత్పత్తి కేంద్రానికి శనివారం భూమిపూజ చేపట్టింది. పరిశ్రమ ఎండీ, సీఈవో అజయ్ సింఘానియా మాట్లాడుతూ ఈప్యాక్ ప్రయాణంలో ఇదో మైలురాయి అన్నారు. మేక్ ఇన్ ఇండియా చొరవకు అనుగుణంగా దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీకి ఇది మరో ముందడుగు అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్‌బి బోత్రా, హైసెన్స్ ఇండియా సీఈవో పంకజ్ రాణా, ఎండీ స్టీవెన్ లీ పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా పంచాయతీల అభివృద్ధి

### - సర్పంచులతో ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు శనివారం ఉదయం ఎమ్మెల్యే పులివర్తి నానీని ఇంటివద్ద కలిశారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా పంచాయతీలను అభివృద్ధి చేసుకుందామని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లింగేశ్వరనగర్, సాయినగర్, కేసీపేట, అవిలాల, బ్రాహ్మణపట్టు, పద్మావతిపురం సర్పంచ్‌లు, టీడీపీ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, కూటమి పార్టీ నేతలు గణపతినాయుడు, సునీల్‌చౌదరి, అమిలినేని మధు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానీతో సర్పంచ్‌లు

### గంటల్లోనే చెవిరెడ్డితో భేటీ

శనివారం ఉదయం ఎమ్మెల్యే నానీని కలిసిన సర్పంచ్‌లు మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో భేటీ అయ్యారు. పంచాయతీల్లో నిధులున్నా , రూ.50వేలకన్నా ఎక్కువ అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే లేదా ఎంపీడీవో అనుమతి తీసుకునేలా ఆదేశించడంతో పల్లెల్లో పనులు పూర్తి చేయలేకపోతున్నామని,కార్యదర్శులు కూడా తమకు సహకరించడంలేదని చెప్పుకొచ్చారు.అభివృద్ధి పనులకు సహకరించని అధికారులను ప్రజలముందు దోషులుగా నిలబెడదామని చెవిరెడ్డి వారితో చెప్పారు.ఉదయం ఎమ్మెల్యేని కలసి సన్మానించిన సర్పంచులు గంటల వ్యవధిలోనే మాజీ ఎమ్మెల్యే ఇంటికి వచ్చి విమర్శలు చేయడం వెనుక అంతర్యమేమిటన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది.